క్లుప్తంగా

రోడ్డుకు మరమ్మతులు



మరమ్మతులను పరిశీలిస్తున్న కోనప్ప

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ నుంచి సలుగుపల్లి వరకు ప్రధాన రహదారి మరమ్మతుల పనులను మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గెలుపోటములతో సంబంధం లేకుండా తనతో పాటు తన అభిమానులు నిరంతరం ప్రజాసేవలలో ఉంటారని అన్నారు. ప్రయాణికులు ఇబ్బందులను గుర్తించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చివేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో అవసరం అయిన చోట స్వచ్ఛందంగా కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఆయన వెంట నాయకులు చౌదరి తిరుపతి, శ్రీనివాస్, సంజీవ్, సాజీద్, చలం, రాజేశ్వర్, కొండయ్య, బండన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్‌కు సన్మానం



శ్రీరామ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

వాంకిడి: ఆర్మీ జవాన్‌గా ఉద్యోగం సాధించిన మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన వడై శ్రీరామ్‌ను గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. నాసిక్‌లో ఆర్మీ ట్రైనింగ్ పూర్తి చేసుకుని ఇటీవల స్వగ్రామానికి రాగా కుటుంబసభ్యులు, గ్రామ పెద్దలు అభినందించారు. ప్రస్తుతం ఢిల్లీలో జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు శ్రీరామ్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైర్ చోరీ

సిర్పూర్(టి): మండలంలోని హుడ్కిలి గ్రామ శివారులోని పెన్‌గంగ నది ఒడ్డుపై ఉన్న హుడ్కిలి ఎత్తిపోతల పథకం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి వైరును గుర్తు తెలియని దొంగల ఎత్తుకుపోయినట్లు హుడ్కిలి ఎత్తిపోతల పథకం చైర్మన్ రషీద్ శుక్రవారం సిర్పూర్(టి) పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎత్తిపోతల పథకం కింద సుమారుగా 1200 ఎకరాల ఆయకట్టు భూమి ఉంటుందని దొంగలు దొంగలించిన ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగితో విద్యుత్ విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. పోలీసులు తక్షణమే దొంగలను పట్టుకొని ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేపట్టాలని కోరారు.

ఊరంతా పూలవనం

కౌటాల/సిర్పూర్(టి)/కెరమెరి: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. శుక్రవారం ఆయా గ్రామాల్లో తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. రామ రామ రామ ఉయ్యాలో అంటూ.. సందడి చేశారు. మహిళలు, యువతులు వేసిన కోలాటాలు ఆకట్టుకున్నాయి. మళ్లీ రావమ్మా బతుకమ్మ అంటూ.. చెరువుల్లో, కుంటల్లో నిమజ్జనం చేశారు.



వీర్దండిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



యాపలగూడలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



సిర్పూర్(టి): రైల్వేస్టేషన్ కాలనీలో..



గుడ్లబోరిలో సద్దుల బతుకమ్మలతో మహిళలు



కెరమెరి: బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఎమ్మెల్యే వినోద్‌కు సన్మానం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌లోని ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశానికి శుక్రవారం హాజరైన బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను ఏరియా ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, సెంట్రల్ కమిటీ నాయకులు ప్రకాష్‌రావు మాట్లాడుతూ సింగరేణి చరిత్రలో కాంట్రాక్టు ఉద్యోగులకు లాభాల్లో నుంచి వాటా చెల్లించటం గతంలో ఎన్నడూ లేదన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కాంట్రాక్టు ఉద్యోగుల సేవలను గుర్తించి సింగరేణి లాభాల్లో నుంచి రూ. 5వేల బోనస్ చెల్లించటం అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వినోద్‌ను సన్మానిస్తున్న నాయకులు

లింగ వివక్షత విడనాడాలి

వాంకిడి: బాలికలపై లింగ వివక్షత విడనాడాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్ డోంగ్రి ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇందాని గ్రామంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బాలికల పట్ల సమాజంలో జరుగుతున్న హింస, వేధింపుల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. లింగ వివక్ష లేని సమాజ నిర్మాణం కావాలంటే ముందు మన ఆలోచనలో మార్పు రావాలన్నారు. లింగ వివక్షతోనే భ్రూణహత్యలు జరుగుతున్నాయన్నారు. అనంతరం చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ బాల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ బాలికలు అతిగా ఫోన్ వాడటం వల్ల కలిగే అనార్థాలను వివరించారు. హక్కుల ఉల్లంఘన జరిగితే 1098, 100 డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామపటేల్ శ్రీకాంత్, చైల్డ్ లైన్ సూపర్‌వైజర్ దుర్గం పితాంబర్, కేస్ వర్కర్ సుకన్య, అంగన్‌వాడీ టీచర్ చంద్రకళ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దోంగ్రి ప్రవీణ్

యువత ఉద్యోగాలు సాధించాలి

కౌటాల: గ్రామీణ ప్రాంత యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉద్యోగం సాధించడంతో వారిని ఘనంగా సన్మానించారు. ఉన్నత చదువులతోనే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. యువత చెడు వ్యాసనాల బారిన పడకుండా చదువుపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు విఠల్, తదితరులు పాల్గొన్నారు.

నేడు బ్రిడ్జి పనులకు శంకుస్థాపన

బెజ్జూర్: పెంచికల్‌పేట్, దహెగాం మండలాలను కలుపుతూ పెద్దవాగు నదిపై అదనపు బ్రిడ్జి నిర్మాణానికి ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ శంకుస్థాపన చేయనునున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. రూ.18 కోట్ల వ్యయంతో మంజూరైన బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు. నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కెరమెరి: మండంలోని జోడేఘాట్ ఈనెల 17న కొలాం వీరుడు కుమురం సూరు 27వ వర్ధంతి నిర్వహించనున్నట్లు కొలాం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్రం గంగారాం, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో వర్ధంతి పోస్టర్ ఆవిష్కరించారు. కొలాం కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కుమురం సూరు వర్ధంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాజు, నాయకులు సిడాం ధర్మూ, మడావి మానిక్‌రావు, కనక ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

మహిషాసుర మర్దినిగా దుర్గమ్మ



మహిషాసుర మర్దిని అలంకరణలో అమ్మవారు

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి అమ్మవారికి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. దుర్గామాత భక్తులకు మహిషాసుర మర్దిని అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆర్టీసీ డిపోలో ప్రత్యేక పూజలు

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో ప్రతిష్ఠించిన దుర్గాదేవికి శుక్రవారం డీఎం విశ్వనాథ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. డిపోలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది, కార్మికులు ఆయురారోగ్యాలతో ఉండాలని, డిపో అభివృద్ధి బాటలో సాగాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎస్టీ సరియా, ఎంఎఫ్ ఉదయ్, సిబ్బంది భారతి పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్

బెజ్జూర్: అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు సోమిని గ్రామంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా కోతకు గురైన వంతెనలు, రోడ్లకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం జిల్లాకు రూ.3 కోట్లను మంజూరు చేశాడన్నారు. ఆ పనులు సైతం త్వరలో ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ప్రాణహిత ఉప్పొంగి పంటలు నష్టపోయిన రైతులకు సైతం త్వరలో డబ్బులు అందిచనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేర్చుతామన్నారు. అనంతరం సోమిని గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన భీమ్ వాలీబాల్ ముగింపు క్రీడల్లో పాల్గొన్నారు. క్రీడల్లో గెలుపొందిన జట్టుకు బహుమతి అందించారు. మండలంలోని కృష్ణపెల్లి గ్రామ సమీపం నుంచి సోమిని గ్రామం వరకు గుంతలమయంగా మారిన రోడ్డు పనులను ఎమ్మెల్సీ దండే విఠల్ ప్రారంభించారు. త్వరలో రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు.

వైభవంగా కేశవనాథుడి శోభాయాత్ర

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ శ్రీ కేశవనాథస్వామి ఆలయంలో శరన్నవరాత్రుల ఉత్సవాలు దేవాదాయ, ధర్మాదాయ శాఖ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. శుక్రవారం చివరి రోజు స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని గజవాహనంపై పట్టణ వీధుల గుండా భాజాభజంత్రీల మధ్య ఊరేగించారు. ఆలయంలో అర్చకులు ఒజ్జల నరేశ్‌శర్మ, సూర్యానారాయణశర్మల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. శోభాయాత్ర అనంతరం ఆలయంలో మంగళహారతి, మహా మంత్రపుష్పం, ఆశీర్వచనం, తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వేణుగోపాల్ గుప్తా, వైరాగడే మనోజ్‌కుమార్, నిమ్మకంటి సుగుణాకర్, వెంకట్ రవీందర్, అభయ్ ఆచార్య, శేషగిరి, గోపాల్, మసాదె బల్వంత్, ప్రతాప్, గిరీష్, శ్రీనివాస్, బాలకిషన్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం



డీటీఆర్‌కు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

కెరమెరి: మండలంలోని సుల్తాన్‌గూడ మసీదువాడలో ప్రతీ రోజు రాత్రి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. సుమారు 80 నుంచి 100 కుటుంబాలు ఉంటాయి. తక్కువ కెపాసిటీ గల డీటీఆర్ అమర్చడంతో రాత్రి సమయంలో లోడు అధికమై కరెంటు పోతుందని వాపోతున్నారు. పగలు ఎలాగైన గడిచి పోతున్నా రాత్రి పూట వీధి దీపాలు కూడా వెలగకపోవడంతో చిమ్మ చీకటి కమ్ముకుంటుంది. ఈ సమస్య మూడు నెలల నుంచి ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు సుజాయత్ ఖాన్ ఆరోపించారు. విషయమై విద్యుత్ సబ్ ఇంజినీర్ రమేశ్‌ను వివరణ కోరగా ప్రస్తుత 15 కేవీ డీటీఆర్ ఉందని త్వరలోనే 25కేవీ డీటీఆర్‌ను అమర్చి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తామన్నారు.

'కార్మికులపై వేధింపులు సరికాదు'

ఆసిఫాబాద్అర్బన్: ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కార్మికులను వేధింపులకు గురి చేయడం సరికాదని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దసరా పండుగ రోజు టిమ్ డ్రైవర్లు, ఇతర కార్మికులకు డ్యూటీలు సరిచేసి ఇవ్వాల్సి ఉండగా.. డీఎం ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గతంలో పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణికుల నుంచి ఎక్స్‌ప్రెస్ సర్వీసు చార్జీలు వసూలు చేసినట్లు గుర్తు చేశారు. ఇప్పటికైనా డిపో మేనేజర్ తన తీరు మార్చుకుని కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించాలని కోరారు. లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

దహెగాం: మండల కేంద్రంలోని స్థానిక శివాలయంలో శుక్రవారం దుర్గాదేవి మండపం వద్ద భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన నిర్వహించారు. శరన్నవరాత్రుల్లో భాగంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు